

సర్రాయిలో చీరల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని సర్రాయి గ్రామంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగ అధ్యక్షురాలు కే కృష్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా గిరి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని రకాలుగా వెనుకబడిన ఆదివాసి గిరిజనులకు పలు సేవా కార్యక్రమాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రెసిడెంట్ ఏం సంపత్ కుమార్ పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న కృష్ణకుమారి

సమస్యలు పరిష్కరించాలని

టూరిజం కార్మికుల నిరసన



అరకులోయలో నినాదాలు చేస్తున్న ఉమామహేశ్వరరావు, కార్మికులు

అరకులోయరూరల్: గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, కొత్తవలస పారంలో కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా కార్మికులకు కనీస వేతనం ఎందుకు చెల్లించ లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ప్రశించారు. ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, హెచ్ఎంటీసీ కొత్తవలస ఫారం గేటు ముందు కార్మికులు డిమాండ్లు పరిష్కరించాలని మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, మండల కార్యదర్శి జన్ని భగత్‌రాం మాట్లాడుతూ, ఐటీడీఏలో పరిధిలో సుమారు 100 మంది పైగా కొన్ని ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, సెలవులు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి కనీస సౌకర్యాలు నోచుకోలేదని తెలిపారు. కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం ఇవ్వకుండా ఇంటికి పంపించడం ఎంతవరకు సమంజసం అని తెలిపారు. 2011-2012 సంవత్సరాల్లో పిఎఫ్ పేరుతో జీతాల్లో కోత విధించి పిఎఫ్ కట్టకుండా ఐటిడిఏ అధికారులు ఎగ్గొట్టారని తెలిపారు. సర్వీస్ ఉన్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కొత్తగా పనిలో చేరిన కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు రాంబాబు, వి.రాజు, గురువు, అప్పలరాజు, జగ్గారావు, పండు, తులసమ్మ పాల్గొన్నారు.

అరకులోయ: టూరిజం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈనెల 22 నుంచి సమ్మె నేపథ్యంలో సోమవారం అరకులోయ తహసిల్దార్‌కు సమ్మె నోటీస్ సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎన్నోమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. 22 సంవత్సరాలు అయినా ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర నాయకుడు గంగరాజు, బాబురావు, అంజల్‌రావు, నర్సింగ్, సంజీవరావు డిమాండ్ చేశారు.

సమ్మె నోటీసు అందజేస్తున్న టూరిజం కార్మికులు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

అరకులోయ రూరల్: ఏపీ టూరిజం కార్మికులు న్యాయపరమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి టూరిజం వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియ(సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు మండల తహసిల్దార్ కు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఏపీ టూరిజం వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంతల అంజిలిరావు మాట్లాడుతూ, గత 20 సవత్సరాలుగా తాము టూరిజంలో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రతలేదని డిగ్రీలు, పీజీలు చదివిన తమకు ప్రమోషన్ కల్పించలేదన్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. ఇప్పుడు ఇస్తున్న జీతాలతో కుటుంబం జీవనం కష్టంగా ఉందని అన్నారు. ఎనిసార్లు టూరిజం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, ఒనాది, ధర్మ, మహేష్, కృప పాల్గొన్నారు.

బొర్రాలో కార్మికుల నిరసన

అనంతగిరి: ప్రభుత్వం ఇచ్చిన హామీను తక్షణమే పరిష్కారం చేయాలని కోరుతూ పలు పర్యాటక శాఖలో పని చేస్తున్న కార్మికులు ఈనెల 22 తేదీ నుండి సమ్మె బాట చేపడుతున్న నేపథ్యంలో సోమవారం ప్రముఖ ప్రర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద కార్మికులు మధ్యాహ్న భోజన సమయం విరమం అనంతరం నిరసన చేపట్టారు ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రతినిధి నర్సింగరాజు మాట్లాడుతూ, గతంలో తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కారం చేయాలని, లేకుంటే ఈనెల 22వ తేదీ నుండి యూనిట్లంతా మూసివేసి సమ్మె బాట చేపడతామని ఆయన స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పలు యూనిట్లలో పని చేస్తున్న కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పోరాటంతోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సోమేస్, రామస్వామి, సింహాద్రి పాల్గొన్నారు.



బొర్రా గుహల వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

మకాంపై ముఖం చాటుకు

'రియల్' కారణాలేనా ?

ఇదిగో అదిగో అంటూనే.. డిసెంబర్ డెడ్‌లైన్!

ఎన్నికలకు నెలలే వ్యవధి.. అయినా ప్రభుత్వం హంగామా



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తాడేపల్లి నుంచి విశాఖకు తన క్యాంపు కార్యాలయం (మకాం) మార్చడంపై ఇదిగో...అదిగో అంటూనే మళ్లీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖం చాటేశారు. డిసెంబర్‌కు అంటూ తాజా ప్రకటన చేశారు. ఈ విషయమై విశాఖ ప్రజానీకంలో తాజాగా చర్చ సాగుతోంది. 'రియల్' కారణాలే దీనికి కారణమని పలువురు చెప్పుకుంటున్నారు. వాస్తవానికి విశాఖ పరిపాలనా రాజధాని అంటూ వైసిపి అగ్రనాయకత్వం, ఆ పార్టీ శ్రేణులూ హడావుడి చేస్తున్నప్పటికీ రాజధాని మార్చడం అన్నది హైకోర్టులో నడుస్తున్న వ్యవహారం. పరిపాలనా రాజధాని విశాఖకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్టే కోసం వెళ్లినా రాలేదు. దీంతో 'క్యాంప్ కార్యాలయం' అంటూ సిఎం వైఎస్ జగన్ రెండేళ్లుగా హడావుడి చేస్తున్నారు. 2023 దసరాకు విశాఖకు సిఎం రావడం ఖాయం.. అన్నట్టుగా ప్రభుత్వ పెద్దలంతా విశాఖ కలెక్టరేట్‌లో సమీక్షలు జరిపారు. హడావుడి చేశారు. తాజాగా డిసెంబర్ అవుటర్‌లైన్ అంటూ స్వయంగా సిఎం వైఎస్ జగన్ చెప్పారు. 2024 ఎన్నికలకు నెలల వ్యవధే మిగిలినా ఈ హడావుడి దేనికి ? అన్న ప్రశ్నలు ప్రజానీకం నుంచి వినిపిస్తున్నాయి..

పాలన షిఫ్టింగా? క్యాంపు ఆఫీసా ?

సోమవారం విశాఖలోని రుషికొండ హిల్ నెంబరు 2లో ఇన్ఫోసిస్ ఐటి కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ తాను షిఫ్టు అవుతున్నానంటూ ప్రకటించారు. అసలు విశాఖకు మొత్తంగా పాలన షిఫ్ట్ అవుతుందా ? ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం మాత్రమే షిఫ్ట్ అవుతుందా ? అన్న సందిగ్ధంలో ఉన్నవారికి సిఎం వైఎస్ జగన్ సోమవారం నాటి పర్యటన స్పష్టత ఇవ్వలేదన్నది వైసిపి శ్రేణుల్లోనూ కలకలం రేపుతోంది. ఆయన మాటలను బట్టి చూస్తే 'నేను వస్తాను.. విశాఖలోనే నివాసం ఉంటాను. ఇప్పటికే అధికారులు అన్నీ చూస్తున్నారు. డిసెంబరుకు షిఫ్టింగ్ విశాఖకు ఉంటుందని చెప్పారు. రెండో మాటగా సిఎంఒ, అధికారుల నివాసానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సిఎం ఎక్కడుంటే సిఎంఒ కూడా అక్కడే ఉండడం వెనుక పరిపాలన కూడా ఇక్కడ నుంచే సాగుతుందా? అదే జరిగితే కోర్టు ధిక్కారం కింద రాదా? అన్న ప్రశ్నలూ పలువురి నుంచి వినిపిస్తున్నాయి. విశాఖలోని రుషికొండపై నిర్మాణం జరుగుతున్న భవనాలు సిఎం సొంత నివాసాలా ? ఆయన క్యాంపు కార్యాలయం కోసమా ? మంత్రివర్గం, అధికారులు ఉండేందుకు కార్యాలయాలా ? ఇతర భవనాలా ? అన్న స్పష్టతను సరైన విధంగా ప్రభుత్వం, ముఖ్యమంత్రి వెల్లడించలేదు.

ప్రారంభం కాని భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

భోగాపురం చుట్టుపక్కలా వైసిపి నేతలు పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారన్న విమర్శలు లేకపోలేదు. అయితే ఎయిర్‌పోర్టు రెండేళ్లలో పూర్తవుతుందన్న భరోసా సిఎం వైఎస్ జగన్ ఇచ్చారు. ఆ దిశగా ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరిగినా పనులైతే సాగడం లేదు. జాప్యం చేస్తున్న కొద్దీ 'రియల్' ధరలు పెరుగుతాయని, అందుకే 'పాలనా' రాజకీయాన్ని ప్రభుత్వం నెలనెలా పెంచుకుంటూ వస్తుందన్న విమర్శలూ లేకపోలేదు. అభివృద్ధి పనులకొస్తే బీచ్‌రోడ్డు విస్తరణ మాత్రమే జరుగుతోంది. విశాఖపట్నం మొత్తంగా రోడ్లు ఎక్కడా బాగుపడడం లేదు. మెట్రో రైలుకు కేంద్రం ఒక్కపైసా విడుదల చేయలేదు. విశాఖలో అత్యంత కీలకమైన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రభుత్వానికి పట్టడం లేదు. పంచగ్రామాల సమస్యపై జగన్ మౌనందాల్చారు. విశాఖకు మకాం...ప్రజల దృష్టి మరలించడానికి తప్ప మరొకటి కాదన్న ప్రతిపక్షాల మాటలు నేటి పరిస్థితుల్లో నిజమే అనిపిస్తున్నాయి.

వినియోగదారులకు

నాణ్యమైన సేవలు అందించండి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్


ప్రజాశక్తి-పాడేరు: పెట్రోల్, డీజిల్ వినియోగ దారులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. చింతలవీధి పంచాయతీ పరిధిలో కోటి 80 లక్షలతో ఐటిడిఏ, హెచ్.పి.సి.ఎల్ సంయుక్తంగా నిర్మించిన పెట్రోల్ బంక్‌ను పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్య లక్ష్మి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ, పెట్రోల్ బంక్ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.
అనంతరం పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని కోటి 20 లక్షల వ్యయంతో నిర్మించిన 12 అంగన్వాడీ కేంద్ర భవనాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, పీవోలు ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా పాడేరు శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణా లకు అధికంగా ప్రతిపాదనలు వస్తున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓల చొరవతో పాడేరు నియోజ వర్గంలో అంగన్వాడీ భవనాలను పూర్తి చేయడం సంతోషకరంగా ఉందన్నారు. పాడేరు మండలం ఐనాడ పంచాయతి గుల్లి, మినుములూరు, జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ మద్రిపాలెం, కొర్రపాడు, జి.కె. వీధిమండలం కె. వెదురుపల్లి, గూడెం పంచాయతీ పాములాయి, జర్రిల, అంతాడ పంచాయతీ తాటిమానుపాలెం, బంగారంపేట పంచాయతీ రాజుపేట, కె.బంగారంపేట, డౌనూరు పంచాయతీ గుమ్మలపాలెం, కొయ్యూరు పంచాయతీ కనపర్తి గ్రామాల అంగన్వాడీ కేంద్రాలు పూర్తి చేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్.ప్రభాకర్, ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి. వి. ఆర్.ఎం. రాజు, హెచ్‌పిసిఎల్ సేల్స్ మేనేజర్ యష్ మిశ్రా, మేనేజర్ ఇంజనీర్ శరణ్ కుమార్, పాడేరు ఎంపిపి ఎస్.రత్నకుమారి, చింతల వీధి సర్పంచ్ పంతాల సీతమ్మ, ఎంపిటిసిలు సల్లా చిట్టెమ్మ, నరసింహ మూర్తి, ఎల్.రామకృష్ణ పాత్రుడు, కుజ్జెలి సర్పంచ్ జి.చిట్టిబాబు, కాడెలి సర్పంచ్ బసవన్న దొర, మాజీ ఎంపిపి సీదరి మంగ్లన్న దొర పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని అనంతగిరి, ఎగువశోభ పంచాయితీ పరిధి గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఆయా పంచాయతీల సర్పంచులు సోమ్మెల రూతు, కొర్రా సింహాద్రిల ఆధ్వర్యన సోమవారం స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణిలు రోడ్డు పలులకు శంకుస్థాపన చేపట్టారు. అనంతగిరి పంచాయతీ పెద్దూరు గ్రామం నుండి మాలింగ్ వలస గ్రామం వరకు రూ 39 లక్షలతో బీటీ రోడ్డు, ఎగువశోభ పంచాయతీ పరిధి దండబాడు మీదుగా హెక్టగుడ, అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం మెయిన్ రోడ్డు వరకు రూ 24 లక్షలతో మెటల్ రోడ్డుకు నిధులు మంజూరైనట్లు నేతలు పేర్కొన్నారు. పనులను తరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి హర్షిత్, ఉప సర్పంచ్ పాంగి. అర్జున్, వార్డు మెంబర్లు సుబ్బారావు, వెంకటరావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న గంగరాజు, నీలవేణి

క్వార్టర్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెలాఖరు నాటికి క్వార్టర్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఆదేశించారు. స్దానిక రహదారులు, భవనాల శాఖ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న క్వార్టర్ల నిర్మాణ పనులను సోమవారం ఆయన తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణంలో నాణ్యతలు పాటించాలని సూచించారు. బిల్లులు చెల్లించడానికి నిధులు కొరత లేదని, వేగంగా పూర్తి చేసి బిల్లులు సమర్పిస్తే వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి. ఆర్. ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి

రూ.35 కోట్లతో జల్ జీవన్ పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో 258 గ్రామాలలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కుళాయలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ శెట్టి నీలవేణి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు సర్పంచులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షను నిర్వహించారు.మండలంలో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిని అధికారులు సభ్యులకు వివరించారు. జీవో 818లో భాగంగా 126 గ్రామాలకు 14.36 కోట్లతో తాగునీటి పథకాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో 28 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని మరో 66 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని 32 గ్రామాల్లో జరగాల్సి ఉందని డిఈఈ జయరాం వివరించారు. సర్పంచులు, ఎంపిటిసిల సమన్వయంతో పనులను వేగవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ గౌతమ్, ఎంపీడీవో హర్షిత్, హౌసింగ్ ఏఈ నాగేశ్వరరావు, జెడ్పిటిసి గంగరాజు, సర్పంచులు పాగి అప్పారావు, పెంటమ్మ రాములమ్మ, చిరంజీవి పాల్గొన్నారు.

కిరాణా షాపులో తనిఖీలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని ఓ కిరాణా షాపులలో కాలం చెల్లిన టాటా గ్లూకోస్ కొని సేవించి ఆస్వస్థతకు గురైన మహిళ అని పలు పత్రికల్లో వచ్చిన కథనానికి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్‌రావు స్పందించి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 14న మండల కేంద్రంలో అందవరపు మోహన్ రావు కిరాణా దుకాణంలో అదే గ్రామానికి చెందిన సర్ని లక్ష్మి గడువు ముగిసిన టాటా గ్లూకోజ్ డ్రింక్ కొనుగోలు చేసి తాగి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే... ఈ సంఘటనకు సంబంధించి ఆదివారం వివిధ పత్రికలలో ప్రచురించిన కథనాలకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్ లో ఉన్న శీతలపానీయాలను పరిశీలించారు. సరుకుల నిల్వలపై ఆరా తీసారు. టాటా గ్లూకోజ్ గోడౌన్ వద్ద తనిఖీ నిర్వహించగా కాలం చెల్లిన టాటా గ్లూకోజ్ డబ్బాలతో బయట పడ్డాయి.కేసులు నమోదు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాలరావు వెల్లడించారు.



పరిశీలిస్తున్న వేణుగోపాలరావు

గిరిజనోత్పత్తులకు జాతీయస్థాయి మార్కెటింగ్



గిరిజన ఉత్పత్తులను పరిశీలిస్తున్న పిఒ సూరజ్‌గనోరే

వందన వికాస కేంద్రాల ద్వారా ట్రైపాడ్‌కు అనుసంధానం

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం : గిరిజన, అటవీ ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే అన్నారు. సోమవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్‌పై అవగాహనకు వందన్ వికాస కేంద్రాలు, మహిళా సమాఖ్యలకు అవగాహనను జ్యోతిప్రజ్వళనతో ప్రారంభించారు. ట్రైఫాడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిసిసి, వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిఒ మాట్లాడుతూ, ఏజెన్సీలోని గిరిజన, అడవి ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి, ట్రైపాడ్ ఆధ్వర్యంలో వందన్ వికాస కేంద్రాల ద్వారా దేశవ్యాప్తంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, గిరిజన మహిళా సంఘాలను ఆర్థికాభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతంలోని అడవి ఉత్పత్తులైన చింతపండు. చీపుర్లు, జీడిపప్పు, తేనె, జీడిపప్పు, పసుపు, సేంద్రియ రసాయనాలు తదితర అడవి ఉత్పత్తుల తయారీకి వెలుగు,. జిసిసి అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు.


కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ, ట్రైపాడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ఐటిడిఎల పరిధిలోని వందన వికాస కేంద్రాలు, మహిళా సంఘాలు తయారుచేస్తున్న అడవి ఉత్పత్తులను జాతీయస్థాయిలో ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్ కల్పిస్తామన్నారు. నాణ్యమైన ఉత్పత్తులకు విదేశాల్లోనూ మార్కెటింగ్ జరిగేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు. వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకటరాజారెడ్డి, వైటిసి మేనేజర్ సుధీర్ పాల్గొన్నారు.

'స్పందన' అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం : స్పందనలో వచ్చిన వ్యక్తిగత, సామాజిక సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారుల ద్వారా చర్యలు చేపడుతున్నట్లు ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశమందిరంలో సబ్‌కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావుతో కలిసి మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులకు ప్రాధాన్యతినిస్తూ వినతులు స్వీకరించారు. ఈ వారం స్పందనలో 30 అర్జీలు వచ్చాయి.

కొన్నాళ్లుగా మూలకు చేరిన 300 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు, కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామ గిరిజన రైతులు బంధం పోతన్న దొర, గంగాల శ్రీనివాసరావు దొర, కంగల సూర్యారావు విన్నవించారు.. వైరామవరం మండలం చావిటి దిబ్బల గ్రామంలో రోడ్డు పక్కనున్న అర ఎకరం గ్రామ కంఠం స్థలాన్ని గిరిజనేతరుడు ఆక్రమించి ఆరు దుకాణాలు నిర్మిస్తున్నాడని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామసర్పంచ్ బచ్చల చిన్నఅమ్ములుతోపాటు ముళ్ళ సూరిబాబు,. పండా సతీష్‌బాబు వినతిపత్రం సమర్పించారు. రాజవొమ్మగి మండలం ఉల్లాకులపాడు పాఠశాలలో విద్యార్థులకు సంఖ్యకు తగ్గట్టుగా అదనపు టీచర్‌ను నియమించాలని పండాల బొజ్జిరెడ్డి, మంగ వీరబాబు, కాకూరి లక్ష్మణరెడ్డి వేడుకున్నారు..పందిరి మామిడి, చెవిటి దిబ్బల గ్రామాల మధ్యలో ఇమ్మిడివరం, వాడపల్లి మధ్య అధ్వానంగా ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిచేయాలని కింటుకూరి సూరిబాబు, కింటూకూరి రాంబాబు విన్నవించారు. కార్యక్రమంలో ఎస్‌డిసిలు జాన్‌రాజ్, డిఎస్.శాస్త్రి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, ఇఇలు జి.డేవిడ్‌రాజు, ఎండీ యూసుఫ్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వర రావు, సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, డాక్టర్ ఇందిర, డిఎస్ఒ సి.శ్రీహరి, డిఇఇలు సాయిసతీష్, శ్రీరామ చంద్రమూర్తి, పిఆర్ డిఇఇలు శ్రీనివాస్, రాజేంద్రబాబు, శ్రీనివాసరావు, వెటర్నరీ డీడీ షరీఫ్, ఎడిఎలు సిహెచ్ కెవి చౌదరి, సావిత్రి, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు, న్యాయవాది ఎవి సత్యనారాయణ పాల్గొన్నారు.



పిఒకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి శ్రీదేవి, తదితరులు

పంటకాలువ మరమ్మతులు చేయండి

భూపతిపాలెం, ముసురుమిల్లి రిజర్వాయర్ పంటకాలువల మరమ్మత్తులు చేపట్టాలని ఎంపిపి బంధం శ్రీదేవి కోరారు. ఈ మేరకు ఐటిడిఎ స్పందనలో పిఒ సూరజ్‌గనోరేకు వినతిపత్రం అందజేశారు. భూపతిపాలెం ప్రాజెక్టు నిర్వహణ సిబ్బంది అలసత్వం వల్ల శివారు పొలాలకు సాగునీరు అందడం లేదని, దీంతో పైర్లు ఎండిపోతున్నా యన్నారు. ముసురుమిల్లి పంట కాలువకు స్థాయికి మించి సాగునీరు ప్రవహించడం వల్ల పలుచోట్ల గండ్లు పడుతున్నా యన్నారు. మద్రివాడ సర్పంచ్ కారం కుమారి, రాజన్నదొర, ఎంపిటిసి వంశి, సచివాలయ కన్వీనర్ చిన్నాలుదొర, ఐ.పోలవరం, ధర మాడుగుల, బందపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలపై అవగాహన



సీలేరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ సౌమ్య

ప్రజాశక్తి -సీలేరు: బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ట పరిణామాలపై స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి సౌమ్య అవగాహన కల్పించారు. సీలేరు మేజర్ పంచాయతీ దుర్గావీధిలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21ఏళ్లు దాటిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలకు స్వస్తి పలుకుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ్, ఉప సర్పంచ్ కె.వల్లిప్రసాద్, పంచాయతీ గుమస్తా ప్రకాష్ సచివాలయ మహిళా పోలీస్ రేవతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

చింతూరు: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బాల్యవివాహాల చట్టం, చిన్నతనంలో పెళ్లిళ్ల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చట్టంపై మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని మహిళా సంఘం సభ్యులతో పాటు, ఎంపిపి సవలం అమల, ఎపిఎం మజ్జి సోమునాయుడు పాల్గొన్నారు.

బాబుకు సంఘీభావంగా కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన చేపడుతున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- కూనవరం : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా, బాబుతో నేను సంఘీభావ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుళ్ళపాడు గిరిజన గ్రామంలో తెలుగు యువత అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. అనంతరం పోలవరం విలీన మండలాల గిరిజనులతో సమావేశం నిర్వహించి గిరిజనులకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా టిడిపి హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. చంద్ర బాబు కోసం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు



కురిడిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పలుచోట్ల జగనన్న సురక్ష

ప్రజాశక్తి-యంత్రాంగం

దుంబ్రిగుడ:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గిరిజనులకు ఓ వరం వంటిదని ఎంపీపీ, జెడ్‌పిటిసి బి.ఈశ్వరి, సిహెచ్ జానకమ్మ చెప్పారు. మండలంలోని కురిడి పంచాయతీ కేంద్రంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామంలోని గడపగడపకు వైద్య సేవలు అందుతుందన్నారు. దీంతో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎన్ విజయ్ కుమార్, కే.కరుణ, పి.రాంబాబు, ప్రేమ, నజీబ్ పాల్గొన్నారు.

జిమాడుగుల: మండలంలో గడుతూరి గ్రామ సచివాలయ పరిధిలోని పలు గ్రామాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు ఎం వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్యాన్ని కూడా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దే నని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొర్ర పద్మ, సర్పంచ్ అప్పలమ్మ, మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, సర్పంచ్ హనుమంతరావు, కళ్యాణ్, వైసిపి సీనియర్ నాయకులు చత్రపతి, మత్స్య కొండబాబు, మూర్తి, వెంకు నాయుడు, లక్ష్మీ నాయుడు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ప్రారంభించారు. శిబిరానికి వచ్చే 600 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందుల కిట్లు అందజేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాళ్లను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపూడి రమణి, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, ఎంపిటిసి కనిగిరి గంగాదుర్గ, చప్పా చంద్రరాణి, ఎంపిడిఒ ఎల్ యాదిగిరేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి ఏ మల్లేశ్వరరావు, సిడిపిఒ దేవమణి, సూపర్‌వైజర్ అరుణలత, వైద్యసిబ్బంది అంగన్వాడి ఆశ వర్కర్లు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని గంగిగోవుపాలులలోజగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపిపి బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, ఎంపిటిసి లోకుల సోమాగాంధీ, సర్పంచు సత్యనారాయణ, జెసిఎస్ మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నేత గాడి,సత్యనారాయణ, కాళ్ళ వనంబాబు, శరబన్నపాలెం ఉపసర్పంచ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లాలం సీతయ్య, డిటి.నాయుడు పాల్గొన్నారు.

యాసిడ్‌దాడి కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : పడుకున్న మహిళపై యాసిడ్ పోసి ఆమె మృతికి కారణమైన వ్యక్తికి యావజ్జీవ శిక్ష విధిస్తూ 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పప్పుల గోవర్ధన్ సోమవారం తీర్పు చెప్పారు. జీవిత ఖైదు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఎపిపి వి.దేవానంద్ కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పాత మాలపల్లి గ్రామానికి చెందిన తారపల్లి అర్జున్ కోరిక తీర్చమని బంగ లక్ష్మిని తరచూ వేధించేవాడు. ఆమె తిరస్కరిస్తుండటంతో కక్ష పెంచుకున్నాడు. 2014 జులై 3వ తేదీన వేకువ జామున 4 గంటల ప్రాంతంలో ఆమె ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న ఆమెపై యాసిడ్ పోసి పరారయ్యాడు. ఆమె కేకలు విని చుట్టుపక్క వారు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. ఆమెను వెంటనే నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మరుచటి రోజే ఆమె మృతి చెందింది. అప్పటి గొలుగొండ సిఐ ఎ.దాశరథి, ఎస్ఐ ఎన్.జోగారావు కేసు దర్యాప్తు చేసి నేరాభియోగపత్రం కోర్టులో దాఖలు చేశారు. న్యాయమూర్తి విచారించి పై విధంగా తీర్పు చెప్పారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

ఘాట్ రోడ్‌లో లారీ బోల్తా

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మండలంలో పర్యాటక ప్రాంతమైన వాలమూరు గ్రామసమీపాన వాలి సుగ్రీవుల ఘాట్‌ఘాట్ రోడ్డులో సోమవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రెండు కాళ్లు నుజ్జునుజ్జు అవ్వగా, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదానికి గురైన లారీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి రొయ్యల మేతతో వెళ్తున్న లారీ, ఘాట్‌రోడ్డులో బ్రేకులు ఫెయిలవ్వడంతో 20 అడుగుల ఎత్తు నుంచి, కింద వైపు ఉన్న మరోరోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా నుజ్జునుజ్జవ్వగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుకు అడ్డంగా కదపలేని స్థితిలో లారీ పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి ఘాట్‌రోడ్డులో రెండువైపులా భారీగావాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న గుర్తేరు ఎస్ఐ జ్వాలాసాగర్ సంఘటనాస్థలికి చేరుకుని, జెసిబి సాయంతో ప్రమాదానికి గురైై రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించారు. గాయపడిన డ్రైవర్, క్లీనర్‌లను మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవ నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు..ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జ్వాలాసాగర్ తెలిపారు.

వైసిపికి నూకలు చెల్లాయి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపికి రాష్ట్రంలో నూకలు చెల్లిపోయాయని మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పటి నుంచో ముఖ్యమంత్రి విశాఖ మకాం గురించి ఊరిస్తున్నారన్నారు. గాలిలోనే వచ్చారు.. గాలిలోనే వెళ్లారని ఎద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తే వివిధ రాజకీయ పార్టీల వారికి, ప్రజాసంఘాల వారికి సమయం కేటాయిస్తారని, ఆ పద్ధతికి జగన్ తిలోదకాలు ఇచ్చారని అన్నారు. అనుభవమున్న రాజకీయ నాయకులు వైసిపిలో ఎందరో ఉన్నారని, వారిని చూస్తే జాలేస్తోందని అన్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో సామంతరాజును నియమించి ప్రతిపక్షాలపై కక్ష సాధిస్తూ ముందుకు వెళ్తున్న జగన్ పార్టీకి సమయం దగ్గరపడిందన్నారు. భీమిలి చుట్టుపక్కల ప్రాంతంలో విజయసాయిరెడ్డి ప్రభుత్వ భూమిని కాజేసారని ఆరోపించారు. ఉత్తరాంధ్రపై సిఎం సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, నాయకులు బుద్ద నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై సిఎం స్పందించకపోవడం సరికాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మాట్లాడి ఉంటే బాగుండేదని, ఆయన ఎటువంటి ప్రస్తావనా చేయకుండా వెళ్లడం శోచనీయమని డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన తలపెట్టిన రిలే దీక్షలు సోమవారానికి 925వ రోజుకు చేరాయి. దీక్షల్లో డివైఎఫ్ఐ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై సిఎంతో మాట్లాడేందుకు ఉక్కు కర్మాగారంలోని యూనియన్ల నాయకులు ప్రయత్నించారని, కనీసం వారికి అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదని తెలిపారు

1/70 చట్టానికి తూట్లు

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు పట్టించుకోని అధికారులు



నిర్మిస్తున్న అక్రమ కట్టడం

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండల కేంద్రంలో గిరిజనేతరులు యథేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపడుతున్నా పంచాయతీ, రెవిన్యూ అధికారులు పట్టించుకోలేదు. కొండవీధిలో భారతీయ స్టేట్ బ్యాంక్ పక్కన గిరిజనేతరుడైన మేస్త్రి సింహాచలం నాయుడు పంచాయితీ, రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా దర్జాగా శాశ్వత నివాస గృహాన్ని అక్రమంగా నిర్మిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యం ఏమిటని స్థానిక గిరిజనులు మండిపడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో 1/70, పీసా చట్టం, గ్రామ సభ అమలులో ఉన్నప్పటికీ గిరిజన హక్కులు, చట్టాలను అతిక్రమించి చట్టానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. గిరిజన హక్కులు, చట్టాలు అమలు చేయవలసిన ప్రభుత్వ అధికారులే గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్నారని గిరిజన, ప్రజా సంఘాలు నేతలు విమర్శిస్తున్నారు.గిరిజనులు జీవనాధారం కోసం చిన్నపాటి రేకులు, షెడ్డులు నిర్మిస్తే అధికారులు ఆగమేఘాలపై వచ్చి ఆ షెడ్డులను తొలగిస్తున్నారని అదే గిరిజనేతరులు బహుళ అంతస్తులు, శాశ్వత నివాస గృహాలు, లాడ్జిలు(వసతి గృహాలు) నిర్మాణం చేస్తుంటే మాత్రం అధికారులు చూసీ చూడనట్టు వ్యహరిస్తున్నారు.అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజనులు ప్రజాసంఘాలు డిమాండ్ చేశారు.

స్థానిక సర్పంచ్ పెట్టేలి దాసుబాబుకు వివరణ కోరగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

సివిల్స్ కోచింగ్ పరీక్షకు 1631 మంది హాజరు

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఐటిడిఎ ఫరిధి 11 మండలాలలో ప్రాజెక్ట్ లక్ష్య పేరుతో యువర్ విజన్-అవర్ మిషన్ కింద సివిల్ సర్వీసెస్ పరీక్షలకు అర్హతగల గిరిజన విద్యార్థులకు తొమ్మిది నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడానికి మొదటి దశ పరీక్ష నిర్వయించామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ సివిల్స్ ఉచిత శిక్షణ ఎంపికకు సోమవారం శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికలు)లో నిర్వహించిన మొదటి దశ పరీక్షను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వంద మార్కులకు నిర్వహించిన సివిల్స్ ఉచిత శిక్షణ ఎంపిక పరీక్షకు 1753 మంది ధరఖాస్తు చేసుకున్నారని, అందులో 1631 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షను పాడేరు, అరకు, చింతపల్లి మండలాలలోని ఏడు కేంద్రాలలో నిర్వహించామన్నారు. మొదటి దశలో సుమారు 500 మందిని ఎంపిక చేసి ఈ నెల 22 వ తేదీన రెండవ దశ పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన వారికి ఈ నెలలో 30, 31 తేదీలలో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో వేపగుంట వైటిసిలో తొమ్మిది నెలల పాటు ఉచిత శిక్షణను అందించి వారిని సివిల్స్ ప్రిలిమ్స్ లో విజేతలుగా నిలపడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. గిరిపుత్రులు దేశంలో అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించాలన్న ఆశయంతో చేస్తున్న ఈ కృషి ఫలవంతంయ్యేలా గిరిపుత్రులు, తల్లిదండ్రులు సహకరించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఓలు ఎల్.రజని, వెంకటరమణ పాల్గొన్నారు.

22న రెండో దశ పరీక్ష
కలెక్టర్ సుమిత్ కుమార్

అభ్యర్థుల మనోభావాలు

-హుకుంపేట మండలం గడికించుమండ గ్రామానికి చెందిన కె.రవితేజ మాట్లాడుతూ, సివిల్స్ ప్రిలిమనరి పరీక్షల స్థాయిలో ఆధునికంగా ఉందని, కరెంటు అఫైర్స్, సమకాలీన అంశాల మేలవింపుతో పరీక్ష పత్రం సివిల్స్ ప్రిలిమినరీ కి ఉపయోగపడే విధంగా రూపొందించడంతో చాలా ఉపయోగంగా ఉందని చెప్పారు.

-హుకుంపేట మండలం గూడ గ్రామానికి చెందిన బి. సోఫియా మాట్లాడుతూ, పర్యావరణ, రాజకీయ, భౌగోళిక శాస్త్రాలు, చరిత్ర,, అర్థమెటిక్, రీజనింగ్ తదితర అంశాలపై అన్ని కోణాలు నుండి వంద మార్కులకు తయారు చేసిన పరీక్ష పత్రం బాగుందని అన్నారు.

అరకులోయ:పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన యువతకు సివిల్స్ ఉచిత శిక్షణ అందించడానికి సోమవారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అరకులోయ కేంద్రంలో రెండు ఆశ్రమ పాఠశాలలో రాత పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్ష కేంద్రాన్ని పాడేరు ఐటీడీఏ పీవో వి అభిషేక్ సందర్శించారు.కంటబౌన్స్ గూడ ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 200 మంది అభ్యర్థులకు 185 మంది, అరకులోయ బాలికల ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రంలో 167 మందికి గాను 149 మంది హాజరయ్యారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని దుర్గం పంచాయతీ పట్టిగారువులో జిల్లా పరిషత్ నిధులు రు.2.20లక్షలతో సీసీ రోడ్డు పనులకు జడ్పీటీసీ రేగం మత్స్యలింగం శంకుస్థాపన చేశారు. త్వరగా సీసీ రోడ్ల పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమలో పట్టం సర్పంచ్ కించయి కృష్ణ, ఉప సర్పంచ్ సొమెలి శంకరావు, అగ్రికల్చర్ డైరెక్టర్ వెంకటరావు, విఆర్పి మజ్జి కొండబాబు, సొమెలి కోటిబాబు, శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు మత్స్యలింగం

ప్రారంభోత్సవాలతో సిఎం బిజీబిజీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఎం జగన్మోహన్ రెడ్డి పర్యటన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం బిజీబిజీగా సాగింది. తొలుత విశాఖపట్నం ఐటి హిల్స్‌లో నిర్మితమైన ఇన్ఫోసిస్ భవనాన్ని సిఎం ప్రారంభించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో యుజియో స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని, అచ్యుతాపురం ఎపి సెజ్‌లో లారస్ ల్యాబ్స్ యూనిట్ - 2 ఫార్ములేషన్ బ్లాక్‌ను ఆయా చోట్లకు వెళ్లి ప్రారంభించారు. రూ.300.78 కోట్లతో నిర్మించిన స్టెరైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫార్మా, బయోటెక్ యూనిట్ల ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నట్టు, రూ.421.70 కోట్లతో అచ్యుతాపురంలో నిర్మించిన లారస్ యూనిట్ ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నట్టు తెలుస్తోంది.



లారస్ ల్యాబ్స్ యూనిట్ 2 ఫార్ములేషన్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న సిఎం జగన్

బీచ్ క్లీనింగ్ మిషన్లు ప్రారంభం

విశాఖ నగరంలో బీచ్‌లను శుభ్రపరిచేందుకు సుమారు రూ.13 కోట్ల వ్యయంతో సమకూర్చిన ఆధునిక బీచ్ క్లీనింగ్ మెషిన్లను సిఎం ప్రారంభించారు. మధురవాడ ఐటి సెజ్ హిల్ నెంబర్ 3లో జివిఎంసి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఒక వాహనాన్ని అధిరోహించి డ్రైవర్ కూర్చున్న చోట కేబిన్‌తో పాటు ఎయిర్ కండిషన్ ఏర్పాటు చేయాలని అధికారులకు, వాహనాల తయారీ సంస్థ ప్రతినిధులకు సూచించారు. విశాఖ నగరానికి సముద్రతీరం తలమానికమని, ఈ సముద్ర తీర పరిశుభ్రతకు, పరిరక్షణకు ఆధునికతతో కూడిన బీచ్ క్లీనింగ్ మెషిన్ వాహనాలు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, మంత్రులు అమర్‌నాథ్, మంత్రి ఆదిమూలపు సురేష్, విడదల రజని, ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, నగర మేయర్ గోలగాని హరి వెంకట కుమారి, శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, ఎంఎల్‌సిలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పామ్ టెక్ సంస్థ మేనేజర్ పంకజ్ మల్హోత్రా, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున పాల్గొన్నారు.

తీవ్ర నిర్బంధం

సిఎం పర్యటన నేపథ్యంలో సిపిఎం, ప్రతిపక్ష పార్టీల నేతలు అరెస్టు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం సిఎం జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. ఎన్ఎఓబి, పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్ నిర్వాసితుల సమస్యలపైనా, కాలుష్య సమస్యలు, పరిశ్రమల్లో ప్రమాదాలు, వేతన సమస్యలపైనా సిఎంకు వినతిపత్రం ఇవ్వకుండా సిపిఎం నాయకులను పోలీసులు అనకాపల్లి జిల్లాలో గృహ నిర్బంధం చేశారు. కొంతమంది నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లారు. సిఎం వెళ్లిపోయే వరకు స్టేషన్‌లో వుంచి ఆనక విడిచిపెట్టారు. నాయకుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి జల్లెడ పట్టారు. వారున్న చోటు తెలుసుకొని అరెస్టు చేశారు. కొప్పాకలో నివాసముంటున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఇంటికి సోమవారం ఉదయం నాలుగు గంటలకు పోలీసులు వెళ్లి ఆయన్ని గృహ నిర్బంధం చేశారు. ఆయన అక్కడ నుంచి అనకాపల్లి సిఐటియు కార్యాలయానికి వెళితే అక్కడ నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. తాడిని తరలించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఆ గ్రామస్తుడు గోవింద్ గ్రామస్తులతో కలిసి బయలుదేరుతుండగా వారిద్దరినీ అరెస్టు చేసి సబ్బవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. గనిశెట్టిని ఆదివారం రాత్రి నుంచి అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. ఆయన ఇంటి దగ్గరలేకపోవడంతో ఆయన వివరాలు తెలుసుకొని తాడిలో అరెస్టు చేశారు. అచ్యుతాపురంలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, మండల నాయకులు సోమినాయుడు, రాంబిల్లి మండల కన్వీనర్ జి.దేముడునాయుడు, రామకృష్ణను అచ్యుతాపురం జంక్షన్‌లో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడ నిరసన తెలిపారు. వీరిని అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌లో ముఖ్యమంత్రి వెళ్లిపోయే వరకు వుంచారు. రాంబిల్లిలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీని గృహనిర్బంధం చేసి, తరువాత పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి పోలీసును మోహ రించారు. మీడియాను కూడా అనుమతించలేదు. సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి, సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.



అచ్యుతాపురంలో పోలీసు వలయంలో సిపిఎం నేతలు

అక్రమ అరెస్టులు దారుణం : సిపిఎం

సిఎం విశాఖ పర్యటనకు వచ్చిన సందర్భంగా పోలీసులు అక్రమ అరెస్టులకు దిగడాన్ని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం ఖండించారు. అక్రమ గృహ నిర్బంధ చర్యలను ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సిపిఎం నాయకులపై నిర్బంధం పెరిగిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం నాయకులంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కులకు భంగం కలిగించే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరును సిపిఎం ఖండిస్తోందన్నారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం ఖండించారు.



నా దేశం నా భూమిలో పాల్గొన్న పెదలబుడు సర్పంచ్ దాసుబాబు

దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- అరకులోయ:దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరులు ఎంతమంది ఉన్నారని, ఆ వీరుల త్యాగాలను స్మరించుకునేందుకు నా దేశం - నా భూమి కార్యక్రమం ఓ గొప్ప వేదికని పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు అన్నారు.అరకులోయ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన నా భూమి - నా దేశం కార్యక్రమంలో సర్పంచ్ దాసుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఒక కలశంలో కలిపి ఢిల్లీ కి తీసుకెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దాసు బాబు మాట్లాడుతూ, ప్రజలందరినీ దేశ భవిష్యత్తు దేశ ప్రగతితో అనుసంధానం చేయడం, ప్రతి వ్యక్తిని దేశ ప్రగతినిలో భాగస్వామ్యం చేసే బాధ్యత తీసుకునేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు. స్థానిక స్వాతంత్ర సమరయోధులను స్మరించు కుంటూ ఈ కార్యక్రమం చేయడం గర్వకారణంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పాడి చందు, వార్డ్ సభ్యుడు త్రినాద్, టిడిపి నాయకుడు నాగరాజు పాల్గొన్నారు



నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

భూ ఆక్రమణలపై ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగుడ గ్రామానికి చెందిన భూమిని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ యజమాన్యం గ్రామ సభ తీర్మానం లేకుండా ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ సోమవారం గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు.

భూ ఆక్రమణ ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, భూమి ఆక్రమణకు గురవుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో ఆటలు ఆడే ఎన్టీఆర్ గ్రౌండ్ ను ఆక్రమించారని, అది చాలదని మిగులు భూమిని కూడా ఆక్రమణలకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.గిరిజననేతరులు ఆదివాసి ప్రాంతంలో గిరిజనులకు ఉచితంగా చదవడానికి విద్యావకాశం ఇస్తామని చెప్పి భూమిని అక్రమణ చేయడం సరికాదన్నారు.ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బురిడీ కోగేశ్వరరావు, పాంగి రాము, బురిడీ గోపాల్, బురిడీ అర్జున్, కిల్లో గోపి,, ఆనంద్, కోటి పాల్గొన్నారు.

సింహగిరిపై రాత్రి అన్నదానం పునఃప్రారంభం

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరిపై కరోనాతో ఆగిపోయిన రాత్రిపూట అన్నదానం కార్యక్రమాన్ని సోమవారం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. గతంలో రాత్రివేళ వచ్చే భక్తులకు సుమారు 200 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగేది. కోవిడ్ నేపథ్యంలో ఈ వితరణ ఆగిపోయింది. స్థానిక విలేకరులు, భక్తులు ఈ విషయాన్ని ఇఒ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఇఒ స్పందించి సోమవారం నుంచి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.



దుస్తులు అందజేస్తున్న చేయూత వారియర్స్

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని అంతర్ల గ్రామంలో నిరుపేదలైన వృద్ధులు, చిన్నారులు, యువతకు చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారంఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. అంతర్ల విజ్ఞానభారతి స్కూల్ దాతల సహకారంతో చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లైన్‌మ్యాన్ పూజారి లోవరాజు, వెంకటలక్ష్మి, దూనబోయిన లోవలక్ష్మి, గోవింద్, జెర్రిపోతుల రామలక్ష్మి, రమణ దంపతుల ఆర్థిక సహకారంతో వీటిని అందజేశారు. చేయూత వారియర్స్ ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే రెండురోజుల సేవా కార్యక్రమంలోభాగంగా అక్టోబర్ నెలలో మొదటి సేవా కార్యక్రమంలో భాగంగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అవసరమైన సేవలను అందిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఈరెల్లి రాజేష్, ఇండుగ శేఖర్, ఇమ్మంది మోదగిరి, కిముడు బిలాస్కర్, గుత్తుల లోవరాజు పాల్గొన్నారు.



స్టాపర్లు ఏర్పాటు చేసిన పోలీసులు

ప్రమాదాల నివారణకు స్టాపర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - సీలేరు: ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు స్థానిక ఎస్ఐ రామకృష్ణ చర్యలు చేపట్టారు. సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో వాహనాల వేగనియంత్రణకు స్టాపర్లను ఏర్పాటు చేశారు. డ్రమ్ములకు రేడియం స్టిక్కర్లను అతికించి, ప్రమాదాలకు ఆస్కారమున్న రామాలయం సెంటర్, ఐటిఐ జంక్షన్, డిఎవి పాఠశాలకు వెళ్లే మార్గం, ఇతరత్రా ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, వాహనదారులు వేగనియంత్రణతోపాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్ ఆటో కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆన్‌లైన్ ఆధారిత ఓలా, ఉబర్, రాపిడోలో పనిచేస్తున్న ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ దాదాపుగా పది వేల మంది ఆటో కార్మికులు ఆన్‌లైన్ ఆధారంగా ప్రతిరోజూ సుమారు లక్ష మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నారన్నారు. వారికి ఇవ్వాల్సిన ఛార్జీలను తగ్గించడంపై మండిపడ్డారు. గతంలో పాసింజర్లకు, డ్రైవర్లకు ప్రమాద బీమా ఇచ్చారని, వాటిని కూడా తొలగించారని తెలిపారు. ఎయిర్ పోర్టులో ఆటోలకు ఆన్‌లైన్ పికప్ ఆపడం సరికాదన్నారు. విమానంలో దిగిన సామాన్యులకు ఆటో అందుబాటులో లేకపోవడంతో అధిక మొత్తం చెల్లించి టాక్సీలో ప్రయాణించాల్సి వస్తోందన్నారు.